క్లుప్తంగా

నేడు బ్రాహ్మణ సంఘం సమావేశం

పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గ బ్రాహ్మణ కుటుంబ సభ్యుల సమావేశం ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు శ్రీగాయత్రీమాత తాలూక బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షుడు సురేంద్రబాబు తెలిపారు. శనివారం మధ్యాహ్నం సంఘం ప్రతినిధులు రామకృష్ణ, రామమ్మూర్తితో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో బ్రాహ్మణులకు కమ్యూనిటీ భవనానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్థలం కేటాయించిందని తెలిపారు. ఆస్థలంలో భవనం నిర్మించేందుకు మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి సహకారంతో పనులు ప్రారంభించే విషయమై సమావేశంలో చర్చ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ హాజరై సలహాలు అందజేయాలని కోరారు.

28న వి.కోటలో 'ఆసరా' పంపిణీ


మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 28వ తేదీన ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో వైఎస్సార్ పంపిణీ ఉంటుందని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ యువరాజు సూచించారు. శనివారం పట్టణంలోని స్త్రీశక్తి భవనంలో ఏపీఎం సుబ్రమణ్యం సమక్షంలో సంఘమిత్రాలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసరా పంపిణీ కార్యక్రమంపై లబ్ధిదారులకు సమాచారం అందించి విజయవంతం చేయాలని సూచించారు. బీసీ సెల్ అధ్యక్షుడు భూపతి యాదవ్, ముదరందొడ్డి వైస్ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, ఎంపీడీఓ మహ్మద్‌రఫీ, ఏపీఓ అశోక్‌రెడ్డి, ఎంఎస్ లీడర్ సరస్వతి పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటింటికీ వైద్యం


గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ చంద్రమహేష్

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలన్నదే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పీ.కట్టకిందపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 85 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆరోగ్యశ్రీ పథకం గురించి వివరించారు. అనంతరం గ్రామంలో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వలు ఉన్నచోట దోమలు వృద్ధి చెందడంతో పాటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పెద్దిశెట్టిపల్లెలో

గుడిపాల: వైద్యసేవలు అందించేందుకు ఇంటి వద్దకే వస్తున్నట్లు డాక్టర్ చంద్ర మహేష్ అన్నారు. పెద్దిశెట్టిపల్లె గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంచాన పడ్డ రోగులకు ఇంటివద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం బీపీ, షుగర్, గర్భిణులకు వైద్యసేవలు అందించి మందులు పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తిరుచ్చిపై శ్రీవారి దివ్యతేజం


తిరుచ్చిపై శ్రీవారి విహారం

పుత్తూరు: అప్పలాయగుంటలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం తిరుచ్చి ఉత్సవం వైభవంగా జరిగింది. వేకువ జామున సుప్రభాత సేవతో శ్రీనివాస స్వామిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్ సేవ కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం చేరుకొన్న శ్రీస్వామి అమ్మవార్లకు మంగళహారతులిచ్చి, ఏకాంత సేవ నిర్వహించారు.

సర్కారు మెరికలు.. పతకాలే లక్ష్యం


చందం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు


వివిధ క్రీడల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆట ఏదైనా సరే బరిలో దిగితే పతకాలు సాధించాల్సిందే. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ వారు ఆదర్శంగా నిలుస్తున్నారు. తల్లిదండ్రులు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో క్రీడల్లో మేటిగా రాణిస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు తొమ్మిదిమంది ఎంపికై పతకాలు సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలన్నదే తమ ధ్యేయమని చెబుతున్న కుప్పం మండలం చందం గ్రామ జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభను తెలుసుకుందాం..

- క్రీడల్లో రాణిస్తున్న చందం ఉన్నత పాఠశాల విద్యార్థులు
- జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు ఈ ఏడాది 9 మంది ఎంపిక
- విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్న ఉపాధ్యాయులు

కుప్పంరూరల్: కుప్పం మండలం, చందం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు క్రీడల్లో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. పాఠశాలలో 337 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో వందమందికి పైగా క్రీడల్లో రాణిస్తున్నారు. ఏటా పాఠశాల క్రీడా పోటీల్లో జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటుతూ వస్తున్నారు. గతంలో పదుల సంఖ్యలో జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ ఏడాది 9 మంది ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

నిత్యం సాధన

చందం పాఠశాల విద్యార్థులకు క్రీడలంటే ప్రత్యేక ఆసక్తి. ముఖ్యంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, బేస్‌బాల్, నెట్‌బాల్, త్రోబాల్, యోగా రాణిస్తున్నారు. ఉదయం పాఠశాల ప్రారంభానికి ముందు 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం పాఠశాల పనివేళలు ముగిసిన తరువాత 4 నుంచి 5 గంటల వరకు విద్యార్థులు పీఈటీ ఆధ్వర్యంలో సాధన సాగుతోంది. సెలవు రోజుల్లో కూడా విద్యార్థులు క్రీడా సామగ్రితో పాఠశాల మైదానంలో కనిపిస్తుంటారు.

ప్రతిభకు మెరుగులు

విద్యార్థులు క్రీడల్లో రాణించడం వెనుక పాఠశాల పీడీ లోకనాథం కృషి ఎంతో ఉంది. క్రీడా కోటాలో ఉద్యోగం సాధించిన ఆయన విద్యార్థులకు తగు సలహాలు, సూచనలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. పిల్లల ప్రతిభకు మెరుగులు దిద్దుతూ శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులకు క్రీడా సామాగ్రి, దుస్తులను తన సొంత ఖర్చులతో కొనిచ్చి ప్రోత్సహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు మార్కొండనాయుడు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ విద్యార్థుల ఉన్నతికి తోడ్పాటు అందిస్తున్నారు.


క్రీడల్లో నిమగ్నమైన విద్యార్థినులు

ప్రభుత్వ ప్రోత్సాహం..

పిల్లలకు పౌష్టికాహారం సకాలంలో అందుతుండడంతో క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు శారీరక దారుఢ్యం పెంచుకుంటున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. అందుకే గతంలో ఎన్నడూ లేని విధంగా పాఠశాల నుంచి గత ఏడాది 11 మంది, ఈ ఏడాది 9 మంది విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. ఆడుదాం–ఆంధ్రా క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారని పేర్కొన్నారు.

జాతీయస్థాయిలో ప్రతిభ

గత ఏడాది ఇద్దరు జాతీయస్థాయి, మరో 9 మంది రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించారు. ఈ ఏడాది 9 మంది జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో నెట్‌బాల్ విభాగంలో పూజా జాతీయస్థాయికి ఎంపికైంది. మిగిలిన ఎనిమిది మంది రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటారు. షష్మా త్రోబాల్, ఝాన్సీరాణి యోగా, లిఖిత షూటింగ్ బాల్, పూజా నెట్‌బాల్, షూటింగ్‌బాల్, లహరి, ప్రియా, భానుప్రకాష్ షూటింగ్ బాల్ అండర్ –19 విభాగంలో పాల్గొని పతకాలు సాధించారు.

ఐపీఎస్ కావడమే లక్ష్యం...



నెట్ బాల్, షూటింగ్ బాల్ పోటీల్లో రాణిస్తున్నా. నెట్‌బాల్ పోటీల్లో స్కూల్ గేమ్స్ విభాగంలో రాష్ట్రస్థాయికి ప్రాతినిధ్యం వహించా. ఐపీఎస్ కావాలన్నదే నా లక్ష్యం. నేను నెట్‌బాల్‌లో రాణిస్తున్నానంటే పీడీ లోకనాథ సార్ ప్రోత్సాహమే. –పూజా,10వ తరగతి

జాతీయస్థాయిలో మెరవాలి



యోగాలో జిల్లా, రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించా. ఈ ఏడాది తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పతకం సాధించా. జాతీయ స్థాయిలో రాణించాన్నదే నా లక్ష్యం. –ఝాన్సీరాణి, 9వ తరగతి

ఆసక్తి ఉంటే చాలు



క్రీడలతోనే ఏకాగ్రత, మానసిక ఉల్లాసం, శారక దారుఢ్యం సాధ్యం. విద్యార్థులు చిన్న తనం నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకుని సాధన చేస్తే ఎలాంటి లక్ష్యమైనా సాధించగలరు. నేను స్వయంగా క్రీడాకారుడిని, జాతీయస్థాయిలో ఆడాలన్నదే నా కల. ప్రస్తుతం విద్యార్థుల ద్వారా నా కల నెరవేరడం చాలా ఆనందంగా ఉంది. విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో నిలపాలన్నదే నా ధ్యేయం. –లోకనాథం, పీడీ

మంచి ప్రోత్సాహం ఇస్తున్నాం



మా పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో రాణిస్తున్నారంటే మాకెంతో గర్వకారణంగా ఉంది. ఇప్పటికే పదుల సంఖ్యలో విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయిలో రాణించారు. విద్యార్థులు పతకాలు సాధించినప్పుడు మా సొంత పిల్లలు సాధించినట్లు ఉంటుంది. మరింత మందిని జాతీయస్థాయి పంపాలనే లక్ష్యంతో ప్రోత్సాహం అందిస్తున్నాం. ఈ క్రమంలో తల్లిదండ్రులు సహకారం మరువలేనిది. –మార్కొండ నాయుడు, హెచ్‌ఎం

ఐటీఐ కోర్సులకు దరఖాస్తులు

శాంతిపురం: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద కొత్తగా ప్రారంభిస్తున్న ఎలక్ట్రీషియన్(డొమెస్టిక్ సొల్యూషన్స్), ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్స్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపల్ నగేష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పూర్తి చేసిన 18 నుంచి 42 సంవత్సరాల వయసు ఉన్న వారు అర్హులన్నారు. ఐటీఐ డ్రాపౌట్స్ కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా బుక్కు జిరాక్స్‌లు, 2 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో కళాశాలలో సంప్రదించవచ్చని తెలిపారు.

పథకాల అమలులో అగ్రగామి


వివిధ వేషధారణ విద్యార్థులతో అధికారులు

శాంతిపురం: పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా ఉందని ఎంపీడీఓ హేమమాలిని తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా 30 సొన్నేగానిపల్లెలో జరిగిన గ్రామ సభలో ఆమె పాల్గొన్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో పథకాల అమలు, లబ్ధిదారుల గుర్తింపులో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. అటల్ పెన్షన్ యోజన, ఉజ్వల్, ఉపాధి హామీ, పీఎం కౌశల్ యోజన తదితర కేంద్ర పథకాలను ఆమె వివరించారు. స్థానిక పరమహంస పాఠశాల విద్యార్థులు స్వతంత్ర సమరయోధుల వేషధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ప్రసాద్, ఈవోపీఆర్డీ ఈశ్వరన్, వెలుగు ఏపీఎం గ్రీటా, పంచాయతీ కార్యదర్శి రవినాయక్ పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

గుడుపల్లె: ఆధునిక సాగు పద్ధతులతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని విల్ ఉడ్ కంపెనీ మార్కెట్ మేనేజర్ నాగరాజు పేర్కొన్నారు. శనివారం శ్రీరాళ్లగంగమాంబ ఆలయం వద్ద శ్రీలక్ష్మి ట్రేడర్స్ రైతు నేస్తం ఆధ్వర్యంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్మి ట్రేడర్స్ యజమాని పళని పాల్గొన్నారు.

కుంభాభిషేకానికి ఎమ్మెల్సీ విరాళం


హోమ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ భరత్

గుడుపల్లె: మండలంలోని కప్పలనత్తంలో కొత్తగా నిర్మించిన శ్రీసీతారాముల ఆలయ కుంభాభిషేకానికి ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ శనివారం రూ.50 వేలు విరాళంగా అందించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు వేద పండితులు బాబుస్వామి, సోమయ్యశాస్త్రి స్వాగతం పలికారు. ఆలయంలో హోమ పూజల్లో ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మునెప్ప, మంజునాథ్, మురళి, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు 9 మంది ఎంపిక


నాగలక్ష్మి


నందినిబాయి


లౌలీ


రూపశ్రీ


యువతేజ

చౌడేపల్లె: ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌నకు మండలం నుంచి తొమ్మిది మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓ కేశవరెడ్డి శనివారం తెలిపారు. చౌడేపల్లె ఉన్నత పాఠశాల నుంచి జి. రూపశ్రీ, వి.నందినిబాయి, బి.లౌలీ, పి నాగలక్ష్మి, చారాల ఉన్నత పాఠశాల నుంచి కె. యువతేజ, పుదిపట్ల ఉన్నత పాఠశాల నుంచి పి.మధురిమ, బి. నందిని, జి.లాస్యరెడ్డి, ఎస్ జాహ్నవి ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరికి నాలుగేళ్ల పాటు ఏటా రూ.12 వేలు ఆర్థిక ప్రోత్సాహం అందుతుందన్నారు. వీరిని ఎంఈఓతోపాటు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు నరసింహులు, నాగరాజారెడ్డి, పద్మజ అభినందించారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి


సమావేశంలో మాట్లాడుతున్నా ఎంపీపీ అశ్విని

కుప్పం: మండలంలో తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఎంపీపీ అశ్విని సూచించారు. శనివారం కుప్పం మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. మూడు నెలల కిందట జరిగిన సర్వసభ్య సమావేశంలో సూచించిన సమస్యల పరిష్కారంపై ఆరా తీశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సూచించిన సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రెస్కో పరిధిలో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సమస్యలపై చర్చించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సభ్యులను కోరారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళలే కీలకం


సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి కార్తీక్

పుంగనూరు: సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, మహిళలు లేకపోతే సమాజాభివృద్ధి లేదని, అలాంటి మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్ తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నరసింహప్రసాద్‌తో కలసి మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. యుక్తవయసు వచ్చే సమయంలో బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా విద్యాహక్కు, రక్షణ చట్టాలను వివరించాలన్నారు. మహిళలపై లైంగిక దాడులు జరిగినప్పుడు వారి కుటుంబసభ్యులు ఎలాంటి భయాందోళనలు లోనుకాకుండా అండగా నిలవాల్సిన అవసరం ఉందని సూచించారు. సమాజాభివృద్ధిలో స్త్రీల ప్రాధాన్యతను వివరించారు. సీఐ రాఘవరెడ్డి మాట్లాడుతూ మహిళలు వేధింపులకు లోనైతే తక్షణమే సమాచారం అందిస్తే వారి కి రక్షణ కల్పించి, బాధ్యులపై పోలీసులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. న్యాయవాదులు ఆనందకుమార్, వీరమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకురాలి మృతి


పద్మావతమ్మ (ఫైల్)

పుంగనూరు: చిత్తూరు జిల్లా ఆగ్రో సీడ్స్ అండ్ ఫెస్టిఫైడ్స్ డీలర్ల సంఘం అధ్యక్షుడు విజయారెడ్డి తల్లి, మండలంలోని చిలకావారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు డి.పద్మావతమ్మ (70) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. పలువురు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫోన్‌లో ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

క్రికెట్ విజేత అమ్మరాజుపల్లె జట్టు



పెద్దపంజాణి: విజేత జట్టుతో అధికారులు, వి.కోట: గెలుపొందిన పాముగానిపల్లె జట్టు

పెద్దపంజాణి: ఆడుదాం–ఆంధ్రా మండల స్థాయి క్రికెట్ టోర్నీ విజేతగా అమ్మరాజుపల్లె పంచాయతీ జట్టు నిలిచింది. మండలంలోని రాయలపేట గ్రామంలో శనివారం క్రికెట్ ఫైనల్ మ్యాచ్ జరిగింది. అమ్మరాజు పల్లె, చామనేరు జట్లు తలబడ్డాయి. ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్‌లో అమ్మరాజు పల్లె జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టు క్రీడాకారులను ఎంపీడీఓ అబ్దుల్ రహీం అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తితో మెలగాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో రాణించి మండలానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ అరుణ, వైస్ ఎంపీపీ ఆంజమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, పార్టీ నాయకుడు మునిరాజు, ఈఓపీఆర్డీ శారదాదేవి, పీఎస్‌లు గణపతి, జఫ్రుల్లా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వి.కోటలో..

వి.కోట: ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీల్లో మండలంలోని పాముగానిపల్లె సచివాలయ జట్టు విజేతగా నిలిచినట్లు ఎంపీడీఓ మహ్మద్‌రఫీ శనివారం తెలిపారు. పట్టణంలోని బాలుర పాఠశాల మైదానంలో నాలుగురోజులుగా సాగుతున్న క్రికెట్ పోటీల ఫైనల్స్‌లో అంబేద్కర్ నగర్ సచివాలయ జట్టు, పాముగానిపల్లె జట్టు తలపడ్డాయి. పాముగానిపల్లె జట్టు విజేతగా ఎంపికై నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది. విజేత జట్టు క్రీడాకారులను ఎంపీడీఓ, ఎంపీపీ యువరాజ్ అభినందించారు.

ఆదరించండి.. అండగా ఉంటాం


ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ

గుడుపల్లె: వైఎస్సార్ సీపీని వచ్చే ఎన్నికలలో ఆదరించండి అండగా ఉంటామని ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ సతీమణి దుర్గ తెలిపారు. శనివారం మండలంలోని కుప్పిగానిపల్లె, ఒంటిపల్లె, సిరిగిరిపల్లె, చీకటిపల్లె, పచ్చార్లపల్లె, కోటపల్లె, కంచిబందార్లపల్లె గ్రామాల్లో ఆమె పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి పసుపు, కుంకుమ,చీర ఇచ్చి ఆత్మీయంగా పలుకరించారు. భరత్‌ను గెలిపిస్తే కుప్పంలోనే అందుబాటులో ఉంటూ, నిత్యం మీ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ఎక్కడో నివాసం ఉండే వ్యక్తికి ఓటు వేసి మోస పోకుండా స్థానికంగా ఉన్న వారికి అవకాశం ఇవ్వాలన్నారు. ఇన్నేళ్లుగా ఓటు వేస్తున్నా, ఏనాడైనా ఆ నాయకుడు మీ సమస్యలు అడిగిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. మీ బిడ్డగా భరత్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, ఎంపిటీసీ సభ్యుడు వెంకటేష్. సర్పంచ్‌లు రామమూర్తి, మంజునాథ్ పాల్గొన్నారు.

ఆత్మజ్ఞానంతోనే ఆనందమయం


ప్రసంగిస్తున్న మాస్టర్ రాజ్యలక్ష్మి

తవణంపల్లె: ఆత్మజ్ఞానం సంపాదిస్తేనే మనస్సు ఆనందమయమవుతుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని సిద్ధంపల్లె సమీపంలోని శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహా శక్తి క్షేత్రంలో ధ్యానమహాయజ్ఞం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ కష్టాలను పోగొట్టుకోవడానికి భగవంతుని కోసం ఎక్కడికెక్కడో వెతుతారని, కానీ భగవంతుడు తనలోనే ఉన్నాడనే సత్యాన్ని గ్రహించాలన్నారు.

మహిళాభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం


సదుం: నడిగడ్డ సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

సదుం: మహిళల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. మండలంలోని ఎర్రాతివారిపల్లె, మొరవపల్లె, బూరగమంద, జోగివారిపల్లె, చెరుకువారిపల్లె, నడిగడ్డ గ్రామాల్లో డ్వాక్రా మహిళలకు ముందస్తుగా వైఎస్సార్ ఆసరా పథకంపై శనివారం అవగాహన కల్పించారు. గత ప్రభుత్వం డ్వాక్రా రుణ మాఫీ, పసుపు–కుంకుమ పేరుతో మహిళలను మోసగించినట్టు పెద్దిరెడ్డి ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేసినట్టు తెలియజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ప్రస్తుత ప్రభుత్వంలో అందుతున్నాయన్నారు. ఎన్నికల నేపథ్యంలో కల్లబొల్లి మాటలతో చంద్రబాబు మళ్లీ మోసగిస్తారని, ఈ మాయ మాటలకు మహిళలు మోసపోకూడదన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్ మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, వైస్ ఎంపీపీ అమరావతి, సర్పంచ్‌లు వెంకటరమణ, కళావతమ్మ, జగన్నాథం, అనితాకుమారి, ఐశ్వర్య, నారాయణరెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, ఇమ్రాన్, పుట్రాజు, ఏపీయం హరిప్రసాద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష


ప్రశ్న పత్రాలను అందిస్తున్న ఎంఈఓ

పలమనేరు: నవోదయ విద్యాలయా 2024 విద్యా సంవత్సరంలో ఆరోతరగతి ప్రవేశాల కోసం శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని బాలికోన్నత, బాలుర ఉన్నత పాఠశాల నిర్వహించిన ఈ పరీక్షలకు మొత్తం 304 మంది హాజరు కావాల్సి ఉండగా, 208మంది హాజరైయ్యారని పరీక్షల చీఫ్‌లు విజయ కుమార్, ఈశ్వర్‌ప్రసాద్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పిల్లలకు అవసరమైన ఏర్పాట్లను చేపట్టారు. పరిశీలకులుగా జగదీష్‌కుమార్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లుగా గణపతినాయుడు, నేతాజీ, ఫ్లైయింగ్ స్క్వాడ్‌గా ఎంఈవో లీలారాణి వ్యవహరించారు.

వృద్ధురాలికి ఆర్థికసాయం

కుప్పం రూరల్: సాంకేతిక కారణాలతో పెన్షన్‌కు నోచుకోని వృద్ధురాలికి వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్థికసాయం చేశారు. కుప్పం మండలం బొగ్గుపల్లెకు చెందిన వృద్ధురాలు పార్వతమ్మ నిరుపేద. సాంకేతిక కారణాలతో పెన్షన్‌కు నోచు కోలేదు. పూట గడవని ఆమె విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ ఆర్థికసాయం చేయాలని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులకు సూచించారు. నాయకులు తిమ్మోజీగౌడు, మురుగేష్, నగేష్, అజయ్, బాబు శనివారం ఆమెకు మూడు వేల రూపాయలు అందజేశారు.